# సాక్షి కర్నూలు

శుక్రవారం ; 12 ; మే ; 2023






## మూడు గంటలు ఆలస్యం

డోన్ టౌన్: డబుల్‌లైన్ పనుల కారణంగా కర్నూలు నుంచి గుంతకల్లుకు వెళ్లే డెమో ట్రైన్ గురువారం మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



## సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు గురువారం 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీకి 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



## ఖాదర్ లింగస్వామి దర్గా కిటకిట

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాను దర్శించుకునేందుకు గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

## న్యూస్‌రీల్

### ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ఐటీఐ కాలేజీల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కాలేజీల జిల్లా కన్వీనర్ ఆర్.ఎస్. ధర్మాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 6 వరకు గడువు ఉందని, ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన దరఖాస్తును ప్రింట్ తీసుకుని ఆయా ప్రాంతాల్లోని సమీపంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కాలేజీలలో అందజేయాలన్నారు.

### ఎల్లార్తికి ఆర్టీసీ బస్సు

- హొళగుంద వరకు రాకపోకలు




ఎల్లార్తి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): హొళగుంద మండలం ఎల్లార్తికి గురువారం సాయంత్రం కొత్త బస్సు సర్వీసును ప్రజా రవాణా శాఖ కర్నూలు జిల్లాధికారి వెంకటరామం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లార్తి దర్గాకు ప్రతి రోజు వందల మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారని, వీరి సౌకర్యార్థం బస్సును నడపుతున్నామన్నారు. ఈ బస్సు కర్నూలులో ప్రతి రోజు సాయంత్రం 4గంటలకు బయలుదేరి నాగులాపురం, ప్యాలకుర్తి, దేవనకొండ, పత్తికొండ, ఆస్పరి, ఆలూరు, ఎల్లార్తిలో ఆగుతూ హొళగుందకు వెళ్తుందన్నారు. ఎల్లార్తికి పెద్దలకు రూ.170, పిల్లలకు రూ.85 చార్జీ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రమణ, కర్నూలు–1డిపో అసిస్టెంట్ మేనేజరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### రేపు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు(లీగల్): కక్షిదారులకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో శనివారం జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి సిహెచ్‌ఎస్‌వీ శ్రీనివాస రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేలా కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు సహకరించాలన్నారు. ఇందులో అన్ని సివిల్, రాజీ కాగల క్రిమినల్, మోటారు వాహన ప్రమాద బీమా, చెక్‌బౌన్స్, బ్యాంకు, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు.

### వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించుకోవాలి



మామిడి పండ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మీరా తదితరులు

బనగానపల్లెరూరల్: సాంకేతికను వినియోగించుకొని వ్యవసాయంలో సరికొత్త మార్పులు తీసుకురావాలని భారత వ్యవసాయ పరిశోధనా మండలి, వ్యవసాయ సాంకేతికత వినియోగ పరిశోధన సంస్థ డైరెక్టర్ జోన్–10 డాక్టర్ ఎస్. మీరా అన్నారు. గురువారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని శాస్త్రవేత్తలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే సెక్రటరీ పి.బాలాజీ ఆధ్వర్యంలో జరిగిన రైతుల ముఖాముఖి కార్యక్రమంలో డాక్టర్ ఎస్. మీరా మాట్లాడారు. సాంకేతికతను అందిపుచ్చుకొని వ్యవసాయరంగాన్ని అభివృద్ధి వైపు నడిపించాలన్నారు. వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జేవీ ప్రసాద మాట్లాడుతూ సహజ పద్ధతిలో పండించి ఉత్పత్తుల కు మార్కెట్‌లో ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ ధనలక్ష్మి, శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

### నేడు ఉచిత సామూహిక సేవలు

శ్రీశైలంటెంపుల్: ధర్మప్రచారంలో భాగం గారేషన్‌కార్డు కలిగిన సామాన్య భక్తులు నెలలో ఒకసారి ఉచిత సామూహిక సేవలను కల్పిస్తున్నట్లు ఈఓ ఎస్ లవన్న తెలిపారు. శుక్రవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉచిత సామూహిక సేవలలో భాగంగా కుంకుమార్చనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సామూహిక సేవలో పాల్గొనదలచిన భక్తులు www. srisailadevastanam. org ద్వారా ముందస్తుగా నమోదు చేసుకోవాలన్నారు. శుక్రవారం 9 గంటలకు అక్క మహాదేవి అలంకార మండపంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ సామూహిక కుంకుమార్చనకు 220 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారన్నారు.

# కోటి కాంతుల ఉపాధి

- ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద కోటి పనిదినాలు
- ఇప్పటి వరకు 16.55 లక్షల పని దినాలు పూర్తి
- రోజూ 1.27 లక్షల మందికి 'ఉపాధి'
- గరిష్ట వేతనం రూ.272 పొందే విధంగా చర్యలు
- జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచి తగ్గిన వలసలు
- అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా పనులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. పని కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్న ఊరిలోనే 'ఉపాధి' దొరుకుతోంది. ఈ ఏడాది కోటి పనిదినాలు కల్పించాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగం పనిచేస్తోంది. 'ఉపాధి' కింద వ్యవసాయ అనుబంధ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. రోజూ లక్ష మందికి పైగా పనులు కల్పిస్తుండడంతో వలసలు తగ్గుముఖం పట్టి పల్లెల్లో సందడి కనిపిస్తోంది.



తుగ్గలి మండలం ఉప్పర్లపల్లిలో ఉపాధి పనులు జరుగుతున్న దృశ్యం

2018-19 నుంచి ఉపాధి పనుల ప్రగతి ఇలా ఉంది..

| సంవత్సరం | కల్పించిన పనిదినాలు (లక్షల్లో) |
|---|---|
| 2018-19 | 62.35 |
| 2019-20 | 67.49 |
| 2020-21 | 84.71 |
| 2021-22 | 82.88 |
| 2022-23 | 91.56 |
| 2023-24 | 100 |
| (లక్ష్యం) | |

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తోంది. అడిగిన వారందరికీ 'ఉపాధి' చూపిస్తోంది. ప్రాజెక్టు డైరెక్టర్‌తో పాటు ఏపీడీలు, ఏపీవోలు ఉదయం 5.30 గంటలకే గ్రామాలకు వెళ్లి కూలీలను చైతన్య పరుస్తున్నారు. 2023–24లో కోటి పని దినాలు కల్పించాలనే లక్ష్యం కాగా.. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 16.55 లక్షల పనిదినాలు కల్పించడం విశేషం. ప్రస్తుతం రోజూ 1.27 లక్షల మంది కూలీలకు పనులకు వస్తున్నారు. రానున్న రోజుల్లో కూలీల సంఖ్య 1.60 లక్షలకు పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. టీడీపీ హయాంలో ఉపాధి హామీ పథకం కింద తూతూ మంత్రంగా పనులు కల్పించేవారు. 2018–19లో 62.35 లక్షల పనిదినాలు మాత్రమే కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2019–20 నుంచి ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. వ్యవసాయ పనులు ముగియడానికి ముందే అన్ని పంచాయతీల్లో పనులు కల్పిస్తున్నారు. దీంతో గతంతో పోలిస్తే జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి.

### జలసంరక్షణ పనులకు ప్రాధాన్యత

ఉపాధి హామీ పథకం కింద జలసంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. చెరువుల్లోకి వర్షపు నీరు వెళ్లేందుకు ఫీడర్ చానల్స్‌ల్లో పూడిక తీయించే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. కాల్వల నుంచి పంట పొలాలకు వెళ్లే ఫీల్డ్ చానల్స్‌ను బాగు చేయిస్తున్నారు. అమృత్ సరోవర్‌లుగా గుర్తించిన చెరువులు, చెక్‌డ్యామ్‌ల్లో పూడిక తీత పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. పర్క్యులేషన్ ట్యాంకులు, మేజర్ కెనాల్స్, బౌండరీ ట్రెంచెస్, ఫాంపాండ్స్ తవ్వకాల పనులు జరగుతున్నాయి. అవెన్యూ ప్లాంటేషన్, పండ్లతోటల అభివృద్ధికి ఉపాధి నిధులతోనే గుంతలు తవ్వకునే పనులు కల్పిస్తున్నారు.



తుగ్గలి మండలం మారెళ్ల గ్రామంలో జరుగుతున్న ఫీడర్ చానల్ పనులు

### వేతనం తగ్గకుండా..

ఉపాధి కూలీల గరిష్ట వేతనం రూ.272 ఉంది. ఉపాధి పనులకు వచ్చే కూలీలందరూ ఈ వేతనం అందుకునే విధంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఉపాధి కూలీలు పొందుతున్న సగటు వేతనం రూ.265 ఉండటం విశేషం. జిల్లాలో అత్యధికంగా తుగ్గలి మండలంలో రోజుకు 10 వేల కుపైగా పనిదినాలు కల్పిస్తున్నారు. మద్దికెర, సీ.బెళగల్, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, గూడూరు మండలాలు టాప్‌లో ఉన్నాయి. ఆదోని మండలంలో గరిష్ట వేతనం రూ.272 పొందుతుండటం విశేషం. కౌతాళం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల్లో సగటు వేతనం రూ.271 పొందుతున్నట్లు తెలుస్తోంది.

### అక్రమాలకు తావు లేకుండా...

ఉపాధి హామీ పథకం అక్రమాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్‌ఎంఎంఎస్) ద్వారా యాప్‌లో కూలీలను హాజరు వేస్తున్నారు. గతంలో మస్టర్ మాన్యువల్‌గా వేస్తుండటం వల్ల బోగస్ హాజరు ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బోగస్‌కు తావు లేకుండా ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో రోజుకు రెండు సార్లు హాజరుతో పాటు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రతి రోజు రెండు సార్లు ఎన్‌ఎంఎంఎస్ ద్వారా హాజరు వేస్తుండటం వల్ల మస్టర్‌లో అక్రమాలు తగ్గేందుకు అవకాశం ఏర్పడింది.

### ఉపాధి పనులు ఆదుకుంటున్నాయి



వేసవిలో ఎలాంటి వ్యవసాయ పనులు లేవు. ఈ సమయంలో ఉపాధి చక్కగా ఆదుకుంటోంది. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు పెద్ద ఎత్తున కల్పిస్తున్నారు. మాకు రోజు వారి వేతనం రూ.270 ప్రకారం లభిస్తోంది. కష్టకాలంలో ఉపాధి పనులు ఆదుకున్నాయి. గతంలో వేసవి వచ్చిందంటే వలస వెళ్లాల్సి వచ్చేది. ఇపుడు ఉపాధి సిబ్బంది ఇంటింటికి వచ్చి పనులు కావాలా అని అడుగుతూ డిమాండ్ తీసుకుంటున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా పనులు కల్పిస్తున్నారు. పనులు ఉండటం, గిట్టుబాటు వేతనం లభిస్తుండటంతో మేం వలస వెళ్లడం మానుకున్నాం.

– నరసింహులు, రాతన, తుగ్గలి మండలం

### ఈ పనులే మాకు ఆధారం



మాకు 20321 నంబరుతో జాబ్ కార్డు ఉంది. మాకు ఉపాధి పనులే జీవనాధారం.. అధికారులు మా గ్రామంలో నిరంతరం పనులు కల్పిస్తున్నారు. జాబ్‌కార్డు కలిగిన వారందరూ పనులకు వచ్చే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. మాకు రోజుకు రూ.272 ప్రకారం వేతనం లభిస్తోంది. వారానికి రూ.1,632 సంపాదించుకుంటున్నాం. స్వంత గ్రామంలో ఈ స్థాయిలో వేతనం లభిస్తుండటం ఊరట లభిస్తోంది. ఉపాధి పనులకు వెళ్తూనే ఇతరత్రా పనులు కూడా చేసుకుంటున్నాం.

– వి.బ్రహ్మయ్య, ఉప్పర్లపల్లి గ్రామం, తుగ్గలి మండలం

### అడిగిన వారందరికీ పని



అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం. వ్యవసాయ పనులు పూర్తి అయినప్పటి నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు పెట్టాం. 2023–24లో కోటి పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 16.55 లక్షల పని దినాలు కల్పించాం. ఉపాధి పనులకు వచ్చే వారందరూ గరిష్ఠంగా రూ.272 ప్రకారం పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అక్రమాలకు తావు లేకుండా ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో హాజరు వేసి ఫొటో అప్‌లోడ్ చేసే ప్రక్రియను చేపట్టాం. ఈ ప్రక్రియ రోజుకు రెండు సార్లు చేపట్టాల్సి ఉంది.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు

# ప్రభుత్వ భవన నిర్మాణాలకు ప్రతి నెలా బిల్లుల చెల్లింపు

- పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ ప్రాధాన్యత (గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ ) భవన నిర్మాణాలకు నిధుల కొరత లేదని, ప్రతి నెలా బిల్లులు చెల్లిస్తున్నట్లు పీఆర్ ఇంజినీరు ఇన్ చీఫ్ బాలునాయక్ తెలిపారు. గురువారం కర్నూలుకు వచ్చిన ఆయన స్థానిక జిల్లా పరిషత్‌లోని పీఆర్ ఎస్‌ఈ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గడువు మేరకు సెప్టెంబర్ నెలాఖరు నాటికి నిర్మాణంలో ఉన్న అన్ని భవనాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. రూఫ్ లెవెల్, ఫినిషింగ్ స్టేజీలో ఉన్న నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇటీవలే ప్రభుత్వం రూ.18 కోట్లను విడుదల చేసిందని, ఇందులో ప్రాధాన్యత భవనాలకు రూ.16.96 కోట్లు, సీసీ రోడ్లకు రూ.2.37 కోట్లు కేటాయింపులు ఉన్నాయన్నారు. పార్ట్ హోల్ ప్రాజెక్టు కింద జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన బీటీ రోడ్డు, ప్యాచ్ పనులకు కూడా మరో రెండు వారాల్లో బిల్లులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. బిల్లులు రావడం లేదనే అపోహను వీడి క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని పనులను వేగవంతం చేయాలన్నారు. పీఎంజీఎస్‌వై కింద కూడా జిల్లాకు ఏడు పనులు మంజూరయ్యాయన్నారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్‌ఈ కే సుబ్రమణ్యం, కర్నూలు, ఆదోని ఈఈలు ఎస్‌సీఈ మద్దన్న, వెంకటప్రసాద్, డీఈఈలు మహేశ్వరరెడ్డి, చౌడేశ్వరరావు, పీఏ టు ఎస్‌ఈ బీ శ్రీనివాసులు, నాగిరెడ్డి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్

# వేలానికి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కోర్టు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆత్మకూరు డివిజన్ కొక్కెరంచ మంచినీటి పథకం పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బకాయిపడిన సొమ్మును జూన్ 30వ తేదిలోగా చెల్లించకుంటే ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్ కార్యాలయ భవనాన్ని వేలం వేస్తామని జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంపై కోర్టు సిబ్బంది కార్యాలయం ఎదుట దండోరా కూడా వేసి, సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ... 2008లో కొక్కెరంచ మంచి నీటి పథకం, ఇతర హ్యాబిటేషన్ పనులను పులిపాటి ఇంజనీర్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పులిపాటి పాపెయ్య రూ.5.82 కోట్లతో పనులు చేపట్టారు. ఈ క్రమంలో చేసిన పనులకు అప్పట్లోనే కొంత మేర బిల్లులు చెల్లించిన ప్రభుత్వం పనుల్లో వ్యత్యాసం ఉందని ఫైనల్ బిల్లును నిలిపి వేసినట్లు సమాచారం. తాను చేసిన పనులకు చివరి బిల్లు రూ.1,50,13,816 రావాల్సి ఉందని కాంట్రాక్టర్ కోర్టులో కేసు వేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు వాయిదా పడుతూ వస్తున్న ఈ కేసుపై జిల్లా న్యాయస్థానం జూన్ 30వ తేదిలోగా సదరు కాంట్రాక్టర్‌కు రూ.3,55,23,432 చెల్లించాలని, లేని పక్షంలో భవనాన్ని వేలం వేయాల్సి వస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి డబ్బుకు సంబంధించిన ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఉందని, అక్కడి నుంచి క్లియరెన్స్ రాగానే చెక్కు రూపంలో బకాయిలను చెల్లిస్తామన్నారు. ఈ విషయాన్ని గతంలో ఇక్కడ పనిచేసిన జిల్లా కలెక్టర్ ద్వారా ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఈఎన్‌సీకి నివేదికలు పంపించామన్నారు. ఆర్థిక శాఖ కార్యాలయానికి వ్యక్తిగతంగా కూడా వెళ్లి పరిస్థితిని వివరించామన్నారు.

## ఐఐఐటీడీఎంలో జాతీయ సాంకేతిక దినోత్సవం

కర్నూలు సిటీ: నగర శివారులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మానుఫ్యాక్చరింగ్(ఐఐఐటీడీఎం)లో గురువారం జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో బెంగళూరు డీఆర్‌డీఓ(డిఫెన్స్ రిసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)ల్యాబ్ శాస్త్రవేత్త దువ్వూరి శేషగిరి ముఖ్య అతిథిగా మాట్లాడారు. డీఆర్‌డీఓ ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన వివిధ క్షిపణుల గురించి, రాడార్ సాంకేతికతతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. రీసెర్చ్ అండ్ ఇమారత్(ఆర్‌సీఐ–హైదరాబాదు) శాస్త్రవేత్త డాక్టర్ ఎం గోపాలక్రిష్ణ మాట్లాడుతూ భద్రత కారణాల దృష్ట్యా రక్షణ అనువర్తనాల కోసం స్వదేశీ నావిగేషన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ట్రిపుల్ ఐటీడీఎం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్సెస్ కన్వీనర్ డాక్టర్ రవీందర్ కట్టా తదితరులు పాల్గొన్నారు.

# 'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి





సమావేశానికి హాజరైన అధికారులు(ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

- జిల్లా స్థాయి మానిటరింగ్ యూనిట్‌లో ఆపరేటర్ల ఏర్పాటు
- వెబ్‌సైట్‌ను ప్రతి రోజూ ఓపెన్ చేయాలి
- ఫిర్యాదులను వెంటనే సంబంధిత శాఖలకు పంపాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత వెబ్‌సైట్‌ను ప్రతి రోజూ ఓపెన్ చేయాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలన చేసి వెంటనే సంబంధిత శాఖలకు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులను ఇంకా చూడాల్సి ఉంది అనే సమాధానం రాకూడదన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై అన్ని శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్యక్రమం కొత్తది కావడంతో ఫిర్యాదుల వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. సీఎం కార్యాలయంలో అందుకోసం 800 మంది ఆపరేటర్లను నియమించారని, అదే స్థాయిలో జిల్లా మానిటర్ యూనిట్‌లోనూ ప్రతి శాఖ నుంచి నోడల్ అధికారులు, ఆపరేటర్లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి మానిటరింగ్ యూనిట్‌ను పర్యవేక్షించేందుకు సీపీఓ ఎల్ అప్పలకొండను ప్రత్యేకాధికారిగా నియమిస్తున్నట్లు చెప్పారు. ఆయన రోజుకు ఒకసారి నోడల్ అధికారులతో మాట్లాడి వచ్చిన ఫిర్యాదులను శాఖల వారీగా పంపాల్సి ఉందన్నారు. మండల స్థాయిలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైనట్‌లైతే వాటిని పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఉన్న ఈడీఎంను అడిగి తెలుసుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీఎం ఆఫీసు నుంచి పర్యవేక్షణ చేస్తున్నారని, అధికారులు ఎటువంటి అలసత్వం వహించకుండా వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారాలను నిర్దేశిత సమయంలో చూపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై ఆడిట్ చేసేందుకు జిల్లా స్థాయిలో జెడ్పీ సీఈఓ ఆధ్వర్యంలో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో అడిషినల్ ఎస్పీ డి.ప్రసాదు, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

# మరింత 'పవర్' ఫుల్!

- ఉమ్మడి జిల్లాకు కొత్తగా తొమ్మిది సబ్‌స్టేషన్ల మంజూరు
- టిడ్కో, జగనన్న కాలనీల్లో నాలుగు ఉపకేంద్రాల నిర్మాణం
- రూ.20.30 కోట్లతో పనులు ప్రారంభం
- మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): గ్రామీణ ప్రాంతాలకు సైతం త్రీ ఫేజ్ విద్యుత్ అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తు అవసరాలను అంచనా వేసి విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుతోంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి కసరత్తు ప్రారంభించింది. ముందుగా లో ఓల్టేజీ ఉన్న ప్రాంతాలను అధికారులు గుర్తించారు. తొమ్మిది కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.20.30కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసి పంపారు. అందుకు సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా టెండరు ప్రక్రియను పూర్తి చేశారు. స్థలాలు లభించిన చోట పనులు ప్రారంభించారు.

### నాణ్యమైన విద్యుత్

వ్యవసాయ, గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొమ్మిది సబ్‌స్టేషన్లు మంజూరు చేశారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 33/11కేవీ సబ్‌స్టేషన్లు 242 ఉన్నాయి. వీటిలో పట్టణ ప్రాంతాల్లో 31, గ్రామీణ ప్రాంతాల్లో 211 ఉన్నాయి. వీటి ద్వారా జిల్లాలోని వివిధ కేటగిరీల వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే అక్కడక్కడలో ఓల్టేజీ ఉండడంతో సమస్యను అధిగమించి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కొత్త సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నారు.

### గ్రామాల్లో ఐదు.. జగనన్న కాలనీలకు నాలుగు

మంజూరైన వాటిలో గ్రామాల్లో ఐదు, జగనన్న కాలనీల్లో నాలుగు సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ, కోడుమూరు మండలం చిలబండ, కృష్ణగిరి మండలం చిట్యాల, పాణ్యం మండలం చిల్లకల్, ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి గ్రామాలకు మంజూరు చేశారు. అలాగే కర్నూలు జగన్నాథగట్టు వద్ద టిడ్కో కాలనీ, ఆత్మకూరు జగనన్న కాలనీ, ఆదోని జగనన్న కాలనీ, నంద్యాల జగనన్న కాలనీలో సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

### మూడు నెలల్లో పూర్తికి చర్యలు

కొత్తగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20.30కోట్లు ఖర్చు చేస్తోంది. ఒక్కో సబ్‌స్టేషన్‌కు సివిల్ పనులు, ప్యానెల్స్, లైన్ వర్క్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇలా అన్నింటికీ కలిపి రూ.2 కోట్లపైగా నిధులు మంజూరు చేసింది. కర్నూలు జగన్నాథగట్టు సబ్‌స్టేషన్‌కు రూ.3.30 కోట్లు మంజూరు చేసింది. ఆత్మకూరు, నంద్యాల, ఆదోని జగనన్న కాలనీలకు రూ.2 కోట్ల చొప్పున, మిగిలిన గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే సబ్‌స్టేషన్లకు రూ.2.20 కోట్ల చొప్పున కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే సబ్‌స్టేషన్లను రీవ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం స్కీం కింద కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది.

### పనుల్లో నాణ్యతకు పెద్దపీట

జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సబ్‌స్టేషన్లు నిర్మిస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలకు కోతలు లేకుండా 24 గంటల విద్యుత్ అందిస్తున్నాం. తాజాగా లో ఓల్టేజీ ఉన్న ప్రాంతాలను గుర్తించి సబ్‌స్టేషన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని మూడు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. స్థల సేకరణ పూర్తయిన చోట పనులు ప్రారంభించాం. నాణ్యత విషయంలో రాజీ లేకుండా సబ్ స్టేషన్లు నిర్మించనున్నాం.

–ఎం. ఉమాపతి, ఎస్‌ఈ, ఆపరేషన్స్, కర్నూలు.

## అప్పులబాధ తాళలేక..



నీరుకట్టు సురేష్‌బాబు (ఫైల్)

పాణ్యం: వడ్డుగండ్ల గ్రామానికి చెందిన నీరుకట్టు సురేష్ బాబు (40) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకున్న రెండెకరాలతో పాటు మరో 8 ఎకరాలు పొలం కౌలుకు సాగు పలు పంటలు సాగు చేశాడు. కాగా ఏటా నష్టం రావడంతో పెట్టుబడికి తెచ్చిన అప్పులు రూ. 15 లక్షలయ్యాయి. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# కేక్ కోసం వచ్చి మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం
- మరో ఇద్దరు చిన్నారులకు గాయాలు



మల్లికార్జున (ఫైల్)



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: తమ బంధువుల అమ్మాయి జన్మదినం సందర్భంగా కేక్ కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అవుకు మండలం లింగంబోడు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, సరోజ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు మల్లికార్జున (21) కర్నూలులో పాలిటెక్నిక్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం తమ బంధువుల అమ్మాయి బర్త్‌డే సందర్భంగా కేక్ కొనుగోలు చేసేందుకు ఇద్దరి చిన్నారులతో కలసి మల్లికార్జున బైక్‌పై బనగానపల్లెకు వచ్చాడు. కేక్‌తో స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా పట్టణ శివారులోని షిరిడీ సాయిబాబా ఆలయం సమీపంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్, బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మల్లికార్జునతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బనగానపల్లె ఆసుపత్రికి తరలించారు. మల్లికార్జున పరిస్థితి విషయంగా ఉండటంతో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వెంటనే తన సొంత వాహనంలో నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైద్యశాలకు చేరుకొని మృతుడి తల్లిదండ్రులను పరామర్శించారు. లింగంబోడు గ్రామం తన సొంత గ్రామంలాంటిదని, మృతుడి కుటుంబీకులకు తనవంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామిరెడ్డి గురువారం తెలిపారు.

## ప్రియురాలిని హత్య చేసిన ప్రియుడు

- పరారీలో హంతకుడు



హత్యకు గురైన సుధారాణి (ఫైల్)

కర్నూలు: నగర శివారు కోడుమూరు రోడ్డులోని గురురాఘవేంద్రనగర్‌లో నివాసముంటున్న సుధారాణి (45) దారుణ హత్యకు గురయ్యింది. నెల్లూరుకు చెందిన ఈమె భర్తను వదిలేసి మూడేళ్ల క్రితం కర్నూలుకు వచ్చి గురురాఘవేంద్ర నగర్‌లో ఉంటోంది. సమీప కాలనీ శివయ్యనగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డితో పరిచయం పెరిగి మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. శ్రీనివాసరెడ్డి గతంలో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ప్రస్తుతం ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. ప్రియురాలు సుధారాణి తనకు తెలియకుండా రోజుల తరబడి బయటకు వెళ్తుందనే అనుమానం పెంచుకుని కొంతకాలంగా ఆమెతో గొడవ పడేవాడు. గురువారం ఉదయం కూడా ఆమెతో గొడవ పడి ఇంట్లోనే మెడకు చున్నీతో బిగించి హత్య చేశాడు. అనంతరం కడపలో ఇంజనీరింగ్ చదువుతున్న ఆమె మొదటి భర్త కూతురు లేఖకు ఫోన్ చేసి 'మీ అమ్మను చంపేశాను' అని చెప్పి ఇంట్లో నుంచి పరారయ్యాడు. లేఖ.. డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నాల్గో పట్టణ సీఐ శంకరయ్య తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించాడు. మెడకు చున్నీతో బిగించడం వల్ల ముక్కులో నుంచి రక్తస్రావం అయింది. ఊపిరాడక నాలుక బయటకు వచ్చింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, హత్యకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

- గని గుంతలో చిక్కుకుని బాలుడి మృతి



సాయికృష్ణ (ఫైల్)



ప్రమాదానికి కారణమైన గని గుంత

మిడుతూరు: తోటి బాలలతో కలిసి సరదాగా ఈత కోసం వెళ్లిన ఓ బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వడ్డె శివ, పార్వతి దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు సాయికృష్ణ(8) నాగలూటి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి సందికొట్కూరు – నాగలూటి రహదారిలో ఉన్న గని గుంతలో ఈతకు వెళ్లారు. గుంతలో ఒండు ఉన్న చోట సాయికృష్ణ చిక్కుకుని నీట మునిగాడు. గమనించిన బాలలు కేకలు వేయడంతో సమీపంలో పని చేస్తున్న గని కార్మికులు అక్కడికి చేరుకున్నారు. వారు గని గుంతలో గాలించగా బాలుడిని గుర్తించి బయటకు తీశారు. కాగా అప్పటికే ఊపిరాడక మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## గిరిజన పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మూడు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 3 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి 3వ తరగతి మినహా 4 నుంచి 9వ తరగతి వరకు ఎస్‌టీ బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. బ్యాక్‌లాగ్ ఖాళీ సీట్లను జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులతోనే భర్తీ చేస్తామన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రవేశం పొందాలనుకునే గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు సంబంధిత పాఠశాలలో ఈ నెల 30వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఖాళీల వివరాలు తరగతుల వారీగా...

| పాఠశాల పేరు | టైపు | 3వ | 4వ | 5వ | 6వ | 7వ | 8వ | 9వ |
|---|---|---|---|---|---|---|---|---|
| ఆలూరు | బాలికలు | 40 | 11 | 02 | 00 | 00 | 00 | 00 |
| కర్నూలు | బాలికలు | 40 | 27 | 20 | 04 | 06 | 00 | 00 |
| తుగ్గలి | బాలురు | 40 | 35 | 34 | 27 | 07 | 08 | 00 |
| మొత్తం: | | 120 | 73 | 56 | 31 | 13 | 08 | 00 |

## రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయండి



మాట్లాడుతున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) పీఎల్ వరలక్ష్మి విత్తన కంపెనీల ప్రతినిధులు, పంపిణీ దారులను ఆదేశించారు. గురువారం కర్నూలు ఏడీఏ కార్యాలయంలోని జిల్లాలోని కూరగాయల విత్తన కంపెనీలు, హైబ్రిడ్ విత్తన కంపెనీలు, బీటీ పత్తి విత్తన కంపెనీల యజమానులు, ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిబంధనల ప్రకారం విత్తనాలు కంపెనీ నుంచి పంపిణీదారుకు, అక్కడి నుంచి డీలరుకు చేరాలన్నారు. పంపిణీదారు నుంచి ఏ డీలరుకు ఏ విత్తనాలు ఎంతెంత ఇచ్చారో రెండు వారాల్లో పూర్తి వివరాలు ఇవ్వాలని కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. బీటీ పత్తి విత్తనాలకు సంబంధించి కంపెనీలు, పంపిణీదారులు ఎంఆర్‌పీ రూ.853 చూపుతున్నాయని, ఇది పద్ధతి కాదన్నారు. దీనిని అవకాశంగా తీసుకొని డీలర్లు అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. లాభాలకు ఆశపడి విత్తనాలను సరిహద్దులు దాటిస్తే ఇక్కడ కొరత ఏర్పడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, సాంకేతిక ఏవో రాఘవేంద్ర పాల్గొన్నారు.

## మద్యం దుకాణంలో చోరీ

- రూ. మూడు లక్షల నగదు అపహరణ
- మద్యం సీసాలను తాకని దొంగలు
- దుకాణ సిబ్బందిపై అనుమానాలు



మద్యం దుకాణం పైకప్పు రేకులను కత్తిరించిన దొంగలు

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ప్రభుత్వ మద్యం దుకాణంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దొంగలు రూ.3,07,000 నగదు అపహరించారు. దుకాణ పైకప్పు రేకులు కత్తరించి చోరీకి పాల్పడ్డారు. ఈ దుకాణంలో సూపర్‌వైజర్‌గా పరమేష్, సెల్స్‌మెన్స్ సురేష్, రవి, నైట్‌వాచ్‌మెన్‌గా సుబ్బన్న విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం మద్యం విక్రయించగా వచ్చిన రూ.3,07,000 నగదును దుకాణంలోని లాకర్‌లో పెట్టి సూపర్‌వైజర్ పరమేష్ తాళం వేయకుండా వెళ్లాడు. రాత్రి దుకాణం మూసి వెళ్లాక నైట్‌వాచ్‌మెన్ సుబ్బన్న దుకాణం వద్ద నిద్రించాడు. గుర్తుతెలియని దొంగలు మద్యం దుకాణం పైకప్పు రేకులను కత్తిరించి లోపలికి చొరబడ్డారు. దుకాణంలో విలువైన మద్యం సీసాలున్నప్పటికీ వాటిని ఏమాత్రం ముట్టుకోకుండా కేవలం బీరువాలోని రూ.3,07,000 నగదును దోచుకెళ్లారు. తెల్లవారిన అనంతరం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో సేల్స్‌మెన్ సురేష్ మద్యం దుకాణాన్ని తెరవగా బీరువా లాకర్ తెరచి ఉండటాన్ని గమనించి సూపర్‌వైజర్ పరమేష్, మరో సేల్స్‌మెన్ రవికి ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చారు. వారు దుకాణం వద్దకు వచ్చి బీరువాలో డబ్బులు పెట్టి తాళం వేయటం మరిచిపోయానని సూపర్‌వైజర్ తెలిపారు. డబ్బులు ఉంచిన బీరువాకు తాళం వేయకపోవటం, ఒక్క మద్యం సీసా కూడా అపహరించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ అండ్ సెబ్ సీఐ ఖాజామొహిద్దీన్ జూపాడుబంగ్లాకు చేరుకొని మద్యం దుకాణాన్ని పరిశీలించారు. జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దుకాణ సూపర్‌వైజర్ పరమేష్, సేల్స్‌మెన్లు సురేష్, రవిని అదుపులోకి తీసుకున్నారు.



చోరీ జరిగిన జూపాడుబంగ్లా మద్యం దుకాణం

## వ్యాపార పెట్టుబడికి తండ్రి డబ్బు ఇవ్వలేదని..

- కుమారుడి ఆత్మహత్య

కర్నూలు: వ్యాపార పెట్టుబడికి తండ్రి ఆరెపోగు వెంకటేశ్వర్లు రూ.10 లక్షలు డబ్బు ఇవ్వలేదని మనస్తాపానికి గురై కుమారుడు ఆరెపోగు జయకర్ (25) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు మండలం మాసామసీదు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు సంతానం. కుమారుడు జయకర్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. గౌండా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కొంతకాలంగా మద్యానికి అలవాటు పడ్డాడు. వారం క్రితం పిజ్జా దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు తనకు రూ.10 లక్షలు ఇవ్వాలని తండ్రిపై ఒత్తిడి తెచ్చాడు. డబ్బు ఇచ్చేందుకు తండ్రి నిరాకరించడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జయకర్ ఉరి వేసుకున్నాడు. హమాలీ పని ముగించుకుని ఇంటికి వచ్చిన తండ్రికి కుమారుడు ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో కిందికి దించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శుక్రవారం ఉదయం కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రామలింగమయ్య తెలిపారు.

### కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

| పంట | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| వేరుశెనగ | 5,299 | 7,389 |
| పొద్దుతిరుగుడు | 4,429 | 4,599 |
| ఆముదం | 5,269 | 5,409 |
| వాము | 12,869 | 16,699 |
| ఎండు మిర్చి | 5,699 | 17,129 |
| శనగలు | 3,590 | 4,130 |
| కందులు | 3,971 | 8,230 |
| మొక్కజొన్న | 1,417 | 1,811 |
| మినుములు | 7,261 | 7,261 |

## 14న హనుమాన్ జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకాలు, ఆకు పూజలు, వడమాల, హనుమత్ హోమం, తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

- కర్నూలు విష్ణు సహస్రనామ సత్సంగం ఆధ్వర్యంలో 14వ తేదీ ఉదయం 7 గంటల నుంచి హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీకందాల రామాచార్యులు తెలిపారు. గణపతి పూజ, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

## రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు ధర్మపేటకు చెందిన రాజేష్ (30) గురువారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజేష్ ప్రకాష్‌నగర్ సమీపంలో రైలు కింద పడి మృతిచెందినట్లు తల్లి లక్ష్మీదేవి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇతనికి ఇంకా వివాహం కాలేదు. మానసిక సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. గతంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో తాత్కాలిక వర్కర్‌గా పనిచేశాడు. మానసిక సమస్యలతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు.



## ఫైనల్లో బెర్త్ కోసం బరిలో భారత బాక్సర్లు

ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ముగ్గురు భారత బాక్సర్లు కీలకపోరుకు సిద్ధమయ్యారు. తెలంగాణకు చెందిన హుసాముద్దీన్ (57 కేజీలు), హరియాణాకు చెందిన దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) సెమీఫైనల్ బౌట్‌లలో పోటీపడనున్నారు. 2022 యూరోపియన్ చాంపియన్ బిలాలా బెనామా (ఫ్రాన్స్)తో దీపక్; సైడెల్ హోర్టా (క్యూబా)తో హుసాముద్దీన్; 2022 ఆసియా చాంపియన్ అస్లాన్‌బెక్ షింబెర్గనోవ్ (కజకిస్తాన్)తో నిశాంత్ దేవ్ తలపడతారు. సెమీఫైనల్లో గెలిస్తే ఫైనల్ చేరి స్వర్ణ-రజత పతకాల బరిలో ఉంటారు. ఓడితే కాంస్య పతకాన్ని గెల్చుకుంటారు. భారత కాలమానం ప్రకారం నేడు సాయంత్రం గం. 5:30కు దీపక్ బౌట్ ఉంది. ఆ తర్వాత హుసాముద్దీన్, నిశాంత్ దేవ్ బౌట్‌లు జరుగుతాయి. ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ఈ బౌట్‌లను ప్రత్యక్షంగా తిలకించవచ్చు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటి వరకు భారత్ నుంచి ఒక్కరే ఫైనల్‌కు అర్హత సాధించారు. 2019లో అమిత్ పంఘాల్ (52 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకం గెల్చుకున్నాడు.

# సరబ్‌జోత్–దివ్య జోడీకి స్వర్ణం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్–దివ్య థడిగోల్ సుబ్బరాజు (భారత్) ద్వయం విజేతగా నిలిచింది. స్వర్ణ–రజత పతక ఫైనల్ పోరులో సరబ్‌జోత్–దివ్య జోడీ 16–14తో జొరానా ఆరునోవిచ్–దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయంపై విజయం సాధించింది. సరబ్‌జోత్ కెరీర్‌లో ఇది రెండో ప్రపంచకప్ స్వర్ణంకాగా... బెంగళూరుకు చెందిన దివ్యకు ప్రపంచకప్ టోర్నీలలో తొలి పతకం కావడం విశేషం. మొత్తం 55 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్–దివ్య ద్వయం 581 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. భారత్‌కే చెందిన ఇషా సింగ్–వరుణ్ తోమర్ జంట 578 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచి పతక మ్యాచ్‌లకు అర్హత పొందడంలో విఫలమైంది. టాప్–4లో నిలిచిన జోడీలు పతక మ్యాచ్‌లకు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో రెండు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

# ‘బ్లాక్‌డే’ పాటించిన రెజ్లర్లు



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్ల నిరసన జంతర్ మంతర్ వద్ద కొనసాగుతోంది. నిరసనకు 18వ రోజైన గురువారం రెజ్లర్లు ‘బ్లాక్‌డే’గా పాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీరంతా నల్ల బ్యాండ్‌లు ధరించి తమ అసంతృప్తిని ప్రదర్శించారు. ‘ఈ రోజు మేం బ్లాక్‌డే పాటించాం. దేశం మొత్తం మాకు అండగా నిలుస్తోంది కాబట్టి విజయం సాధిస్తామని నమ్ముతున్నాం. న్యాయం దక్కే వరకు మా నిరసన కొనసాగుతుంది’ అని బజరంగ్, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ అన్నారు.

## శ్రీకాంత్‌కు విదేశీ కోచ్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్నాడు. ఇండోనేసియాకు చెందిన వీంపి నహోర్ది ఇక నుంచి శ్రీకాంత్‌కు శిక్షణ ఇస్తాడు. 2021 డిసెంబర్‌లో భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్‌గా ఉన్న అగుస్ ద్వి సాంతోసో తిరిగి వెళ్లిపోయాక భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్ లేకుండా పోయాడు. కోచ్ కావాలని భారత స్పోర్ట్స్ అథారిటీకి గత జనవరిలో ప్రతిపాదన పంపించినా ఎలాంటి చర్యలు లేకపోవడం... ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలు మొదలుకావడంతో తానే కోచ్‌ను నియమించుకున్నానని శ్రీకాంత్ తెలిపాడు.

## భారత్‌కు క్లిష్టమైన ‘డ్రా’




దోహా: ఏషియన్ కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు కఠినమైన ‘డ్రా’ ఎదురైంది. వచ్చే ఏడాది జనవరిలో ఖతర్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్ ‘బి’లో ఆస్ట్రేలియా (ప్రపంచ 29వ ర్యాంక్), ఉజ్బెకిస్తాన్ (74వ ర్యాంక్), సిరియా (90వ ర్యాంక్) జట్లతో కలిసి భారత్ (101వ ర్యాంక్) ఉంది. వచ్చే ఏడాది జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. 67 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో భారత జట్టు 1964లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత భారత్ 1984లో, 2011లో, 2019లో ఈ టోర్నీకి అర్హత సాధించినా గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

# జై జైస్వాల్...

**47 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98 నాటౌట్**

- 9 వికెట్లతో రాజస్తాన్ ఘన విజయం
- ఈడెన్‌లో కోల్‌కతా చిత్తు
- చహల్‌కు 4 వికెట్లు


చహల్




యశస్వి జైస్వాల్

తొలి ఓవర్లో 6, 6, 4, 4, 2, 4... ఇలా దూకుడు మొదలు పెట్టిన యశస్వి జైస్వాల్ ఆగలేదు... తొలి 6 బంతుల్లో 26 పరుగులు రాబట్టిన అతను తర్వాతి 7 బంతుల్లో మరో 24 పరుగులు కొట్టేశాడు. అంతే...13 బంతుల్లో ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో కొత్త రికార్డు సృష్టించాడు. 3 ఓవర్లలోపే యశస్వి హాఫ్ సెంచరీ అయిపోయింది. మరో 3 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 78 పరుగులు. అక్కడే మ్యాచ్‌లో ఎవరు గెలవబోతున్నారో అర్థమైపోయింది! ఇక మిగిలింది యశస్వి ఎంత దూరం, ఎలా వెళతాడనేది... సెంచరీ వరకు చేరగలిగాడు కానీ రెండు పరుగుల తేడాతో శతకం చేజారింది. అయితేనేం ఐపీఎల్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడిన జైస్వాల్ రాజస్తాన్ జట్టును గెలిపించాడు... మరో ఎండ్‌లో కెప్టెన్ సామ్సన్ మెరుపు బ్యాటింగ్‌తో పని సులువైంది. రాజస్తాన్ 41 బంతులు మిగిలి ఉండగానే నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది.

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్తాన్ పండగ చేసుకుంది. నైట్‌రైడర్స్ బ్యాటింగ్ చేసినంత సేపూ నెమ్మదిగా అనిపించిన పిచ్‌పైనే పరుగులు వరద పారించి కీలక విజయాన్ని అందుకుంది. గురువారం జరిగిన పోరులో రాజస్తాన్ 9 వికెట్ల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (42 బంతుల్లో 57; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. యజువేంద్ర చహల్ 25 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి కోల్‌కతాను కట్టడి చేశాడు. అనంతరం రాజస్తాన్ 13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 151 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 98 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (29 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగి జట్టును లక్ష్యానికి చేర్చారు.

వెంకటేశ్ అయ్యర్ బ్యాటింగ్‌ను మినహాయిస్తే కోల్‌కతా ఇన్నింగ్స్ ఆసాంతం పేలవంగా సాగింది. వెంకటేశ్ కూడా మరీ విధ్వంసకరంగా ఆడకపోయినా... పరిస్థితిని బట్టి తనవంతు పాత్ర పోషించాడు. వెంకటేశ్ 42 బంతుల్లో 57 పరుగులు చేయగా ... ఇతర ఆటగాళ్లంతా కలిసి 78 బంతుల్లో 89 పరుగులు చేయగలిగారంటే అతని ఇన్నింగ్స్ విలువ తెలుస్తుంది.

**ధనాధన్...**

ఆశ్చర్యకరంగా పార్ట్‌టైమ్ బౌలర్, కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా మొదటి ఓవర్ వేశాడు. ఆ ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టి ప్రత్యర్థిని యశస్వి కఠినంగా శిక్షించాడు. సమన్వయ లోపంతో జోస్ బట్లర్ (0) రనౌట్ కావడంతో రాయల్స్ తొలి వికెట్ కోల్పోయింది. అయితే జట్టుపై అది ఎలాంటి ప్రభావం చూపించలేదు. యశస్వి, సామ్సన్ కలిసి వేగం తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరి షాట్లకు నైట్‌రైడర్స్ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. సామ్సన్ 16 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను నేలపాలైంది. అనంతరం అనుకూల్ వేసిన ఓవర్లో 3 సిక్సర్లతో సామ్సన్ చెలరేగాడు. చివర్లో యశస్వి సెంచరీ విషయంలో కాస్త ఉత్కంఠ నెలకొంది. యశస్వి 94 పరుగుల వద్ద ఉండగా రాయల్స్‌కు 3 పరుగులు కావాలి. 13వ ఓవర్ చివరి బంతికి పరుగు తీయని సామ్సన్ సిక్సర్ కొట్టమన్నట్లుగా సైగ చేస్తూ యశస్వికి అవకాశం ఇచ్చాడు. అయితే తర్వాతి బంతికి ఫోర్ మాత్రమే రావడంతో యశస్వి 98 పరుగుల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది. అయితే దానిని పట్టించుకోకుండా అతను విజయానందాన్ని ప్రదర్శించాడు.



**1** ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసిన క్రికెటర్‌గా యశస్వి (13 బంతుల్లో) నిలిచాడు. గతంలో ఈ రికార్డు కేఎల్ రాహుల్, కమిన్స్ (14 బంతుల్లో) పేరిట ఉంది.

**187** ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చహల్ రికార్డు నెలకొల్పాడు. డ్వేన్ బ్రేవో (161 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును చహల్ (143 బంతుల్లో 187 వికెట్లు) సవరించాడు.

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | పా | నె.ర. |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 11 | 8 | 3 | 0 | 16 | 0.951 |
| చెన్నై | 12 | 7 | 4 | 1 | 15 | 0.493 |
| రాజస్తాన్ | 12 | 6 | 6 | 0 | 12 | 0.633 |
| ముంబై | 11 | 6 | 5 | 0 | 12 | -0.255 |
| లక్నో | 11 | 5 | 5 | 1 | 11 | 0.294 |
| బెంగళూరు | 11 | 5 | 6 | 0 | 10 | -0.345 |
| కోల్‌కతా | 12 | 5 | 7 | 0 | 10 | -0.357 |
| పంజాబ్ | 11 | 5 | 6 | 0 | 10 | -0.441 |
| హైదరాబాద్ | 10 | 4 | 6 | 0 | 8 | -0.472 |
| ఢిల్లీ | 11 | 4 | 7 | 0 | 8 | -0.605 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

**ఐపీఎల్‌లో నేడు**

ముంబై × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

### స్కోరు వివరాలు

**కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** జేసన్ రాయ్ (సి) హెట్‌మైర్ (బి) బౌల్ట్ 10; గుర్బాజ్ (సి) సందీప్ శర్మ (బి) బౌల్ట్ 18; వెంకటేశ్ (సి) బౌల్ట్ (బి) చహల్ 57; నితీశ్ రాణా (సి) హెట్‌మైర్ (బి) చహల్ 22; రసెల్ (సి) అశ్విన్ (బి) ఆసిఫ్ 10; రింకూ సింగ్ (సి) రూట్ (బి) చహల్ 16; శార్దుల్ (ఎల్బీ) (బి) చహల్ 1; అనుకూల్ (నాటౌట్) 6; నరైన్ (సి) రూట్ (బి) సందీప్ 6; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 149. వికెట్ల పతనం:** 1-14, 2-29, 3-77, 4-107, 5-127, 6-129, 7-140, 8-149. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-15-2, సందీప్ శర్మ 4-0-34-1, అశ్విన్ 4-0-32-0, రూట్ 2-0-14-0, యజువేంద్ర చహల్ 4-0-25-4, ఆసిఫ్ 3-0-27-1.

**రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** యశస్వి (నాటౌట్) 98; బట్లర్ (రనౌట్) 0; సామ్సన్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 151. వికెట్ల పతనం:** 1-30. **బౌలింగ్:** నితీశ్ రాణా 1-0-26-0, హర్షిత్ రాణా 2-0-22-0, శార్దుల్ ఠాకూర్ 1.1-0-18-0, వరుణ్ చక్రవర్తి 3-0-28-0, సునీల్ నరైన్ 2-0-13-0, సుయశ్ 3-0-22-0, అనుకూల్ 1-0-20-0.

# సినిమా

# ఆ విషయం ఓ సవాల్‌గా మారింది

\- నాగచైతన్య



**“ఓ నటుడుగా నన్ను నేనెప్పుడూ విమర్శించుకుంటూనే ఉంటాను... అభినందించుకోను. ఎప్పటికప్పుడు తప్పులు వెతుకుతూనే ఉంటాను.. నటుడిగా నన్ను నేను మెరుగుపరచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాను” అని అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం ‘కస్టడీ’. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగచైతన్య చెప్పిన విశేషాలు.**

- తమిళ చిత్రం ‘మానాడు’ విడుదల కాకముందే వెంకట్ ప్రభుగారు నాకు ‘కస్టడీ’ స్టోరీ చెప్పారు. అయితే ‘మానాడు’ విడుదలై, హిట్ సాధించిన తర్వాత, ఈ సినిమానే మేం తెలుగులో రీమేక్ చేస్తే బాగుంటుందన్నట్లుగా కొందరు నిర్మాతలు అభిప్రాయపడ్డారు. కానీ ‘కస్టడీ’ స్టోరీ నన్ను ఎగ్జయిట్ చేసింది. పైగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొంతవరకు పూర్తయింది. దీంతో ‘కస్టడీ’ని సెట్స్‌పైకి తీసుకెళ్లాం. ఈ సినిమాలో భాగంగా కొందరు పోలీసులను కలిశాను. వారి కథలు నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి.
- ఈ సినిమాలో నేను పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్ర చేశాను. నా కెరీర్‌లో ఎప్పుడూ చేయనటువంటి కొన్ని కొత్త యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా కోసం చేశాం. కథ రీత్యా ఈ తరహా యాక్షన్ సీక్వెన్స్‌లు అవసరం అయ్యాయి. అయితే కొన్ని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం కొంత రిహార్సల్స్ చేశాం. ఈ సినిమాలోని వాటర్ సీక్వెన్స్ కోసం మూడు రోజులు రిహార్సల్స్ చేసి, దాదాపు 15 రోజులు షూట్ చేశాం. ఈ ఎపిసోడ్ ఓ హైలైట్‌గా ఉంటుంది.
- సినిమా మొదలైన తొలి ఇరవై నిమిషాలు కూల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే స్క్రీన్‌పైకి అరవింద్ స్వామిగారు వస్తారో అప్పట్నుంచి స్టోరీ మలుపు తీసుకుని ఆడియన్స్‌ను స్క్రీన్‌పై నుంచి చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్, అరవింద్ స్వామి, ప్రియమణి వంటి సీనియర్స్ నటించారు. వారి నుంచి నేను కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఇచ్చిన డైలాగ్స్‌ను తనదైన స్టైల్లో ఇంప్రూవ్ చేసి చెబుతుంటారు అరవింద్ స్వామి గారు. ఇది నాకు చాలా కొత్తగా అనిపించింది. వెంకట్‌గారు ఏ స్క్రిప్ట్ అయితే నాకు చెప్పారో అదే తీశారు. ఆయన స్క్రీన్‌ప్లే స్టయిల్ తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది. ఈ చిత్రంలో కమర్షియల్ ఎలిమెంట్స్ స్టోరీకి తగ్గట్లుగానే ఉంటాయి. ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అవుట్‌పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నాను. పోలీస్ బ్యాక్‌డ్రాప్ సినిమాల్లో నాకు ‘ఘర్షణ’, నాన్నగారి ‘శివమణి’, ‘జేమ్స్ బాండ్’ యాక్షన్ ఫ్రాంచైజీ చిత్రాలు ఇష్టం.
- నిర్మాత శ్రీనివాసా చిట్టూరిగారు సెట్స్‌లో కూల్‌గా ఉంటారు. ‘కస్టడీ’ నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించబడింది. ఈ సినిమా 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. ఇళయరాజాగారు, యువన్ శంకర్‌రాజాగార్లు ఇచ్చిన మ్యూజిక్ ‘కస్టడీ’కి ప్లస్. ‘కస్టడీ’ని వేరే సినిమాతో పోల్చవద్దు. ‘కస్టడీ’ చిత్రం ‘కస్టడీ’యే.
- నేను తెలుగు డబ్బింగ్ కోసం దాదాపు పది రోజులు తీసుకుంటాను. కానీ తమిళ ‘కస్టడీ’ సినిమాకు డబ్బింగ్ పూర్తి చేయడానికి నెలరోజుల టైమ్ పట్టింది. నా సొంత వాయిస్ అయితే ఆడియన్స్‌కు యాక్టర్‌గా చేరువ కావొచ్చు. మన పెర్ఫార్మెన్స్ కూడా మెరుగ్గా కనిపిస్తుంది. అందుకే తమిళంలో డబ్బింగ్ చెప్పాను.
- నేను ఫలానా రకమైన సినిమాలు చేస్తేనే ఆడియన్స్‌కు నచ్చుతాయని అదే ట్రాక్‌లోకి వెళితే ఓ యాక్టర్‌గా అది నా బలహీనత అవుతుంది. ఈ విషయంలో నన్ను నేను కన్విన్స్ చేసుకోలేను. గతంలో నేను చేసిన కొన్ని లవ్‌స్టోరీలు వర్కౌట్ అయ్యాయి. అలా అని అవే సినిమాలు చేస్తుంటే ఓ యాక్టర్‌గా ఎదగలేను. చైతన్య ఎలాంటి సబ్జెక్ట్ అయినా బాగా చేస్తాడని ఆడియన్స్‌తో అనిపించుకోవాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులకు ఏ రకమైన సినిమాలు నచ్చుతున్నాయో తెలుసుకోవడం చాలెంజ్‌లా మారింది. కానీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా ఇస్తే వారి ఆదరణ ఓ రేంజ్‌లో ఉంటుంది.
- నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి త్వరలో అధికారికంగా చెబుతాను. ‘ధూత’ వెబ్ సిరీస్ రిలీజ్ అమెజాన్ చేతిలో ఉంది. ఈ ఏడాదే స్ట్రీమింగ్ స్టార్ట్ కావొచ్చు.

**మా తాతగారు, నాన్నగారు గొప్ప గొప్ప సినిమాలు చేశారు. కొన్ని స్టాండర్డ్స్ క్రియేట్ చేశారు. కొందరు వారితో మాకు పోలికలు పెడుతుంటారు. అయితే ఈ విషయాన్ని నేను ఓ ప్రెజర్‌లా తీసుకోను. చాలెంజ్‌లా స్వీకరించి, నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఆ స్థాయికి నేను రీచ్ అవుతానా? లేదా అనేది నాకు తెలియదు. కానీ నా శక్తివంచన లేకుండా కష్టపడుతూనే ఉంటాను.**


**నా గురించిన కొన్ని వార్తలు వస్తూనే ఉన్నాయి (విడాకుల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ..). డిఫరెంట్ వార్తలు రాస్తున్నారు. కానీ ఆడియన్స్ ఫూల్స్ కాదు. తెలివైనవారు. ఏది జెన్యూన్ న్యూస్.. ఏది కాదనేది వారికి తెలుసని అనుకుంటున్నాను. నేను అయితే నవ్వుకుని వదిలేస్తున్నాను.**

## గేమ్ స్టార్ట్


● అదాశర్మ

‘ది కేరళ స్టోరీ’ వంటి వివాదాత్మక సినిమా తర్వాత హీరోయిన్ అదా శర్మ ఓ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ‘హేట్ స్టోరీ 2’ ఫేమ్ విశాల్ పాండ్య దర్శకత్వంలో శ్రేయాస్ తల్పాడే హీరోగా నటిస్తున్న చిత్రం ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’. ఈ చిత్రంలో అదా శర్మ నటిస్తున్నట్లు చిత్రయూనిట్ గురువారం ప్రకటించింది. ఇటీవల కాలంలో యువతలో బాగా ప్రాచుర్యం పొందిన ‘బ్లూ వేల్ గేమ్’ (బ్లూ వేల్ ఛాలెంజ్) నేపథ్యంలో థ్రిల్లర్‌గా ఈ కథ సాగుతుంది. ఇందులో అదా శర్మ పోలీస్ పాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ‘‘గతంలో ‘కమాండో’ సినిమాలో భావనా రెడ్డి అనే పోలీస్ పాత్ర చేశాను. ఆ పాత్ర మంచి ప్రజాదరణ పొందింది. ఇప్పుడు ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’లో గాయత్రీ భార్గవ్ అనే పోలీస్ పాత్ర చేస్తున్నాను. నా పాత్ర సరదాగా, విభిన్నంగా ఉంటుంది’’ అన్నారు.

## ఓ సరదా ప్రయాణం


● నాగశౌర్య

నాగశౌర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘రంగబలి’. ఈ చిత్రం ద్వారా పవన్ బాసంశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎస్‌ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ‘రంగబలి’ని జూలై 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. నాగశౌర్య ట్రెండీ గెటప్‌లో కనిపిస్తున్న ఓ పోస్టర్ ద్వారా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ‘‘పల్లెటూరి నేపథ్యంలో సాగే కథతో ‘రంగబలి’ ఫన్ రైడ్ (సరదా ప్రయాణం) గా ఉండబోతోంది. ఇందులో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.. ఇందుకు ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే తెలియజేస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్ మణి.

## ప్రపంచంలో జరుగుతున్నదే మళ్ళీ పెళ్లిలో చూపిస్తున్నాం

\- వీకే నరేశ్


● నరేశ్, పవిత్రా లోకేశ్, ఎమ్ఎస్ రాజు

‘‘ఓ మనిషి చావు చివరి దశలో ఉన్నప్పుడు చేయాల్సిన పనులు ఏవైనా మిగిలి ఉన్నాయా? ఏమైనా ప్రదేశాలను చూడాలనుకుని చూడలేక పోయామా? మనవల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందా? అనే మూడు అంశాల గురించి ఓసారి ఆలోచిస్తాడు. కానీ ఏ మనిషి జీవితంలో అయినా ఈ మూడు ఆశలు తీరనవిగా ఉండకూడదు. ఇదే ‘మళ్ళీ పెళ్లి’ సినిమా బేసిక్ కాన్సెప్ట్’’ అన్నారు నటుడు వీకే నరేశ్. ఎమ్ఎస్. రాజు దర్శకత్వంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘మళ్ళీ పెళ్లి’. విజయకృష్ణా మూవీస్ పతాకంపై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో విజయకృష్ణా మూవీస్ లోగోను వీకే నరేశ్, పవిత్రాలు రీ లాంచ్ చేశారు. ఎమ్ఎస్ రాజు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వీకే నరేశ్ మాట్లాడుతూ– ‘‘ప్రపంచంలో జరుగుతున్న అంశాలనే ఈ చిత్రంలో బోల్డ్‌గా చూపించాం. ఇది నా జీవితానికి సంబంధించిన సబ్జెక్ట్ కాదు’’ అని అన్నారు. ‘‘సినిమాలో ఉన్నట్లే జీవితంలో కూడా ఫస్టాఫ్, సెకండాఫ్ ఉంటాయి. ఎవరైనా సెకండాఫ్ చాలా బాగుండాలని కోరుకుంటారు.. అదే ‘మళ్ళీ పెళ్లి’ కాన్సెప్ట్. ఆడియన్స్‌ను చీట్ చేయడం లేదు. తప్పుని తప్పుగానే చూపిస్తున్నాం.’’ అన్నారు ఎమ్ఎస్ రాజు. ‘‘ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు ఎమ్ఎస్ రాజుగారి నుంచి చాలా నేర్చుకున్నాను’’ అన్నారు పవిత్రా లోకేశ్. ఈ కార్యక్రమంలో సంగీతదర్శకులు సురేశ్ బొబ్బిలి, అరుల్‌దేవ్, ఎడిటర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.

## హ్యాపీ ఎండింగ్


● యశ్ పూరి

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా నటించిన చిత్రం ‘హ్యాపీ ఎండింగ్’. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో హామ్స్ టెక్ ఫిల్మ్స్, సిల్లీ మాంక్స్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ‘‘అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా ఉంటుంది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. అజయ్ ఘోష్, విష్ణు ఓయ్, ఝాన్సీ, అనిత చౌదరి, హర్ష రోషన్, జియా శర్మ నటించిన ఈ సినిమాకు సంగీతం: రవి నిడమర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ రామానుజం.

## వాస్తవ ఘటనతో...


● నిష్మా, ఇషాన్, శక్తి

ఇషాన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘అంతం కాదిది ఆరంభం’. శక్తి మహీంద్రా, నిష్మా, ప్రణాళి హీరోయిన్స్. ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ దశరథ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. తమని ట్రాప్ చేసి, నగ్న వీడియోలు తీసి వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు? అనేదే ఈ చిత్రకథ’’ అన్నారు. సిరాజ్ మాట్లాడుతూ– ‘‘ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలతో ఇషాన్ ఈ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించాడు’’ అన్నారు. సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య, రచయిత రాంబాబు గోసాల, షేర్ స్టూడియో అధినేత దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: టి. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కత్రి మోహన్.

## హీరో ఆఫ్ ఇండియా!


● అంకిత, కిషోర్

కిషోర్ తేజ, అంకిత మూలేర్ జంటగా ఆకుల రాఘవ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘హీరో ఆఫ్ ఇండియా’. తుమ్మలపల్లి రామసత్య నారాయణ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ లాంచ్ చేశారు. జె. భానుప్రసాద్ స్వరపరచిన మొదటి పాటని తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, రెండో పాటని నిర్మాత సాయి వెంకట్ లాంచ్ చేశారు. ‘‘తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, అమెరికాలోనూ మా సినిమాను రిలీజ్ చేస్తున్నందుకు హ్యాపీ’’ అన్నారు తుమ్మలపల్లి రామసత్యనారాయణ.